సాక్షి
కరీంనగర్
I
బుధవారం, 1, మే, 2024

100 రోజుల్లో ప్రజల గుండెల్లో చోటు సంపాదించాం





జమ్మికుంటలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావు, మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు ఆది, సత్యం, సభకు హాజరైన ప్రజలు

- కరీంనగర్ జిల్లా చైతన్యవంతమైంది
- ఇక్కడ ఎర్రజెండా నీడలో పేదలకోసం ఎన్నో పోరాటాలు జరిగాయి
- రామప్ప శివుడి మీద ఒట్టు.. ఆగస్టు15లోగా రుణమాఫీ చేస్తాం
- జమ్మికుంట జనజాతర బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/హుజూరాబాద్: రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా 100రోజుల్లో మంచి పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో ఉన్నతమైన స్థానం సంపాదించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే ఈ ప్రభుత్వం ఏర్పడిందని కొనియాడారు. రాష్ట్రంలో మూడునెలల్లో 30వేల ఉద్యోగాలు భర్తీచేశామని పేర్కొన్నారు. రామప్ప శివుడి మీద ఒట్టేసి చెబుతున్నా ఆగస్టు 15లోగా తప్పకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అధ్యక్షతన జనజాతర బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా చైతన్యవంతమైందని అన్నారు. ఎర్రజెండా నీడలో ఇక్కడ ఎంతోమంది విప్లవకారులు పేదల కోసం పోరాటం చేశారని కొనియాడారు. ఎం.సత్యనారాయణరావు, చొక్కారావు, జువ్వాడి రత్నాకర్‌రావు లాంటి ఎందరో గొప్పవాళ్లను కరీంనగర్ జిల్లా అందించిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం చింతమడక నుంచి వచ్చిన కేసీఆర్‌కు ఇక్కడి ప్రజలు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. కరీంనగర్‌ను వదిలి కేసీఆర్ మహబూబ్‌నగర్ వస్తే తెలంగాణ కోసం గెలిపించామని అన్నారు. ఈ పదేళ్లలో మోదీ ఇచ్చింది ఏమీ లేదని.. కరీంనగర్‌కు బండి సంజయ్ తెచ్చింది ఏం లేదన్నారు. కరీంనగర్‌లో అరగుండు, నిజామాబాద్‌లో బోడిగుండు రాష్ట్రానికి తెచ్చిందేంలేదని ఎద్దేవా చేశారు. రాముడి పేరు చెప్పుకొని ఓట్లు అడుక్కునే దిక్కుమాలిన పరిస్థితి కరీంనగర్, నిజామాబాద్ బీజేపీలో ఉందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగిందన్నారు. అందుకే మహబూబ్‌నగర్, చేవేళ్ల, భువనగిరి, కరీంనగర్, మల్కాజ్‌గిరిలాంటి సీట్లలో బీజేపీని గెలిపించాలని కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారన్నారు. నల్గొండ, మెదక్ లాంటి సీట్లలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును లక్షఓట్ల మెజార్టీతో కరీంనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిపించాలని ప్రజలను కోరారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరముందన్నారు. తాను ఎంపీగా రాష్ట్ర సాధన కోసం పోరాటం చేస్తూనే, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. బండి సంజయ్ కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడం కక్షసాధింపు చర్యల్లో భాగమే అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో కేసీఆర్ ఎన్ని కుట్రలుచేసినా.. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ మాట్లాడుతూ.. 10ఏళ్ల పాలనలో దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెంచిన బీజేపీని ఈ ఎన్నికల్లో పాతాళంలోకి తొక్కాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

96.65శాతం ఉత్తీర్ణత

- 'పది' ఫలితాల్లో జిల్లాకు ఏడోస్థానం
- 12,555మందికి 12,134మంది ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి
- 64 జెడ్పీపాఠశాలలు, ఐదు మోడల్, మూడు కేజీబీవీల్లో వందశాతం ఫలితాలు

జిల్లాలో పదోతరగతి ఫలితాలు ఇలా

	బాలురు	బాలికలు	మొత్తం
హాజరైనవారు	6,677	5,878	12,555
ఉత్తీర్ణులైనవారు	6,400	5,734	12,134
ఉత్తీర్ణత శాతం	95.85	96.65	96.65



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్దన్‌రావు, తదితరులు

కరీంనగర్:

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ఏడోస్థానం దక్కించుకుంది. గతేడాది 95శాతం ఉత్తీర్ణతతో 4వ స్థానం సాధించగా ఈసారి 96.65శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నా.. మూడు స్థానాలు పడిపోయింది. ఎప్పటిలాగే బాలుర కన్నా బాలికలే పైచేయి సాధించారు. జిల్లావ్యాప్తంగా 12,555మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,134 మంది ఉత్తీర్ణత సాధించారు. 421మంది ఫెయిల్ అయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 95మంది హాజరు కాగా 72మంది విద్యార్థులు 75.78శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా 10జీపీఏ సాధించిన విద్యార్థులు అత్యధికంగా ఉండటం గమనార్హం. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, ఎయిడెడ్, మోడల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్‌లకు సంబంధించి 192 పాఠశాలల నుంచి 6,379 మంది పరీక్షలకు హాజరు కాగా 6,059మంది ఉత్తీర్ణత సాధించారు. 84 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు వచ్చాయి. 80మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. ప్రైవేట్‌విభాగంలో జిల్లాలోని 150పాఠశాలల నుంచి 6,176 మంది పరీక్షలకు హాజరు కాగా 6,075 మంది ఉత్తీర్ణత సాధించారు. 88పాఠశాలల్లో 100శాతం ఫలితాలొచ్చాయి. 374మంది 10 జీపీఏ సాధించారు.

సత్తా చాటిన మోడల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు

పదోతరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు మోడల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో 11మోడల్ పాఠశాలలు ఉండగా ఐదు పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. 984మంది పరీక్షలు రాయగా 968 మంది ఉత్తీర్ణత సాధించారు. 18 మంది 10జీపీఏ సాధించడం విశేషం. 12 కేజీబీవీల్లో 391మందికి గానూ 373 మంది ఉత్తీర్ణత సాధించారు. తొమ్మిది మైనార్టీ పాఠశాలల్లో 402మంది విద్యార్థులకు గాను 388మంది ఉత్తీర్ణత సాధించారు. 10 బీసీ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 719మంది విద్యార్థులకు గానూ 716 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 523మంది విద్యార్థులకు గానూ 511మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని, వారికి జూన్ 03 నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ జనార్దన్‌రావు వెల్లడించారు.రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి డీఈవో ఆఫీసులో సంప్రదించాలని సూచించారు. రీకౌంటింగ్‌కు ఒక్కోసబ్జెక్టు రూ.500 చొప్పున డీడీ, రూ.100 చలాన్ ద్వారా ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీవెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చొప్పున చలాన్ చెల్లించి సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

గ్రేట్ అచీవ్‌మెంట్

- వివరాలు IIలో

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: సమ్మర్‌ క్యాంపులు బుధవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలు ఈ నెల 31 వరకు కొనసాగనున్నాయి. నగరపాలిక ఆధ్వర్యంలో శిబిరాలపై సందిగ్ధం నెలకొంది. మంగళవారం డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి క్రీడా కిట్లు పంపిణీ చేశారు.

ఆటలు, వేదికలు, కోచ్‌ల వివరాలు..

వాలీబాల్‌, రామడుగు, ఆశాలు, ఫోన్‌ : 9908528205, వాలీబాల్‌, వెదిర, కరుణాకర్‌ రెడ్డి : 9502760690, వాలీబాల్‌, ఆకునూర్‌, రాజ్‌కుమార్‌ : 9704142324, వాలీబాల్‌, అన్నారం, శ్రీనివాస్‌ : 9700517852, కబడ్డీ, గన్నేరువరం, మల్లేశ్‌ : 9866508649, కబడ్డీ, గర్షకుర్తి, సుధాకర్‌ : 9182781032, హాకీ, గుమ్లాపూర్‌, చంద్రశేఖర్‌ : 9490530300, తైక్వాండో, మామిడాలపల్లి, సంపత్‌ : 9494489384, జూడో, నెదునూర్‌, శ్రీనివాస్‌ : 9000190331, నెట్‌బాల్‌, నగునూర్‌, అంజన్‌సాయి : 6281774073.

సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నత ప్రమాణాలతో శిక్షణ ఇస్తారు. – శ్రీకాంత్‌ రెడ్డి, డీవైఎస్‌వో, కరీంనగర్‌

టేబుల్‌ టెన్నిస్‌ చాంపియన్‌ కరీంనగర్‌



కరీంనగర్‌స్పోర్ట్స్‌: ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్‌ టెన్నిస్‌ పోటీల్లో కరీంనగర్‌ జిల్లాజట్టు ప్రతిభ కనబరిచి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ సాధించినట్లు టేబుల్‌ టెన్నిస్‌ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌కుమార్‌, సురేందర్‌సింగ్‌ తెలిపారు. క్యాడెట్‌ విభాగంలో చైత్ర, అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్య పతకాలు సాధించారు. ఓపెన్‌ మిక్స్‌డ్‌ డబుల్స్‌లో అజయ్‌, అవనిరెడ్డి, అజయ్‌, పురుషుల డబుల్స్‌లో అజయ్‌, చిన్మయి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. సంఘం ఉపాధ్యక్షులు శ్రీధర్‌గౌడ్‌, మహేశ్‌, మహిపాల్‌, జాయింట్‌ సెక్రటరీ వికాస్‌కుమార్‌, కోశాధికారి గౌతంరెడ్డి అభినందించారు.

'పది'లో పేదింటి బిడ్డల ప్రతిభ

పేదింటి బిడ్డలు పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కష్టాలకోర్చి, ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. రేయింబవళ్లు ప్రణాళిక ప్రకారం చదివి, తల్లిదండ్రుల కల నిజం చేశారు. ఊరికి, చదువుకున్న స్కూల్‌కు, ఉపాధ్యాయులకు పేరు తీసుకువచ్చారు.

• ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి, 10 జీపీఏ • ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత నమోదు



అక్షయ



అఖిల



సారథి



దేవిశ్రీ సత్య



సృజనశ్రీ



ఐశ్వర్య



అశ్విత



అనూష



కీర్తన



స్పందన

కొత్తపల్లి(కరీంనగర్‌): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచి, 96.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. కొత్తపల్లి(హెచ్‌) జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొల్లె అక్షయ 10 జీపీఏ సాధించింది. మోడల్‌ స్కూల్‌కు చెందిన బాకారపు అఖిల, కొండపల్లి సారథి, నర్సింగోజు దేవిశ్రీ సత్య, పెండోట సృజనశ్రీ, పురుషోత్తం ఐశ్వర్య, తాటికొండ అశ్వితలు 10 జీపీఏతో సత్తా చాటారని ప్రిన్సిపాల్‌ వి.సరిత తెలిపారు. చింతకుంట సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్‌ స్కూల్‌కు చెందిన ఇ.అనూష, కె.కీర్తన, జె.స్పందన 10 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్‌ జేజే థెరిసా పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో మధుసూదనాచారి అభినందించారు.

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలతోపాటు కస్తూరిబా విద్యాలయంలో పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. కేశవపట్నం మోడల్‌ స్కూల్లో తాళ్ల నిఖిల 10 జీపీఏ, కేజీబీవీ విద్యార్థిని దీక్షిత 9.8 జీపీఏ సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు.



నిఖిల



దీక్షిత



నందినిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్‌: సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దురిశెట్టి నందిని 10 జీపీఏ సాధించింది. మొత్తం 62 మంది విద్యార్థులకు గానూ 57 మంది ఉత్తీర్ణులయ్యారు. 9.5, ఆపైన జీపీఏ 9 మంది, 8.5, ఆపైన జీపీఏ ముగ్గురు సాధించారు. నందినిని డీఈవో జనార్దన్‌రావు అభినందించారు. సెక్టోరల్‌ అధికారి అశోక్‌రెడ్డి, ఓపెన్‌ స్కూల్‌ కో–ఆర్డినేటర్‌ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌, ఉపాధ్యాయులున్నారు.

చిగురుమామిడి(హుస్నాబాద్‌): మండలంలోని చిన్నముల్కనూర్‌ ఆదర్శ పాఠశాల విద్యార్థిని దాసరి సిరివైష్ణవ్య 10 జీపీఏ, మరో ఆరుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



సిరివైష్ణవ్య

సైదాపూర్‌ మండలంలో 100 శాతం..

సైదాపూర్‌(హుస్నాబాద్‌): మండలంలోని 10 ఉన్నత పాఠశాలలతోపాటు, కేజీబీవీ, ఆదర్శ, బీసీ గురుకుల విద్యాలయాల్లో మొత్తం 302 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. నలుగురు 10 జీపీఏ సాధించగా వీరిలో ఒకరు ఆదర్శ పాఠశాలకు చెందిన బోయిని భూమిక, మిగతావారు బీసీ గురుకుల విద్యార్థులు. ఈ స్కూల్లో 79 మందికి గానూ 56 మంది 9.5 జీపీఏ, ఆపైన సాధించారు. ఫలితాలపై మండల విద్యాధికారి కేవీ నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పుట్టుకతోనే తల్లిని కోల్పోయాడు..



గణేశ్‌

సైదాపూర్‌ మండలం అమ్మనగుర్తి గ్రామానికి చెందిన లంకదాసరి గణేశ్‌ పుట్టుకతోనే తల్లిని కోల్పోయాడు. తండ్రే అన్నీ తానై పెంచాడు. బీసీ గురుకులం తల్లిలా ఆదరించిందని, 10 జీపీఏ సాధించడం ఆనందంగా ఉందని తెలిపాడు. భవిష్యత్తులో సివిల్స్‌లో రాణించి, ఐఏఎస్‌ అవ్వాలని ఉందన్నాడు. గణేశ్‌ ఆర్టిస్టు. పలు చిత్రాలకు జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నాడు.

వ్యవసాయ కుటుంబం నుంచి..



రాము

జమ్మికుంటకు చెందిన రాము తల్లిదండ్రులు శ్రీనివాస్‌–సుజాత. వీరిది వ్యవసాయం కుటుంబం. రాము బీసీ గురుకులంలో చదివి, 10 జీపీఏ సాధించాడు. ఉన్నత చదువులు చదివి, ఐపీఎస్‌ అవుతానని తెలిపాడు.

గన్నేరువరం(మానకొండూర్‌): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 206 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవగా 204 మంది పాసయ్యారు. గుండ్లపల్లె మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు పుప్పాల సాక్షిత, నిమ్మల యశశ్రీ 9.8 జీపీఏ సాధించారు.



సాక్షిత



యశశ్రీ

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండలంలో 98 శాతం పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు. నల్లగొండ, ఎల్‌ఎండీ, మొగిలిపాలెం, పొలంపల్లి, పర్లపల్లి, మల్లాపూర్‌, నేదునూరు, మన్నెంపల్లి ఉన్నత పాఠశాలలు, మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే, కస్తూరిబా గాంధీ అలుగునూర్‌ సీవోఈ విద్యాలయాలు 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. సీవోఈ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కరీంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన సంజన, సాయి చంద్రికలు 10 జీపీఏ, ఒకరు 9.8, ముగ్గురు 9.5 జీపీఏ, 9 ఆపైన జీపీఏను 10 మంది విద్యార్థులు సాధించారు. హెచ్‌ఎం ప్రమోద, ఉపాధ్యాయులు అభినందించారు.



సంజన



సాయిచంద్రిక

కరీంనగర్‌రూరల్‌: ఎస్సెస్సీ ఫలితాల్లో బొమ్మకల్‌ మహాత్మా జ్యోతిబా పూలే కొత్తపల్లి మండల బాలుర పాఠశాల విద్యార్థులు(63 మంది) వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్‌ అంజలి తెలిపారు. ఎ.శివశంకర్‌, ఎన్‌.మహేశ్‌, కె.జయసింహ, టి.అఖిల్‌ 10 జీపీఏ, ఐదుగురు 9.8, ముగ్గురు 9.7, 24 మంది 9 జీపీఏ ఆపైన సాధించారని పేర్కొన్నారు.



శివశంకర్‌



మహేశ్‌



జయసింహ



అఖిల్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): పట్టణంలోని మైనార్టీ పాఠశాలకు చెందిన పి.అన్విత, టి.త్రిష 10 జీపీఏ సాధించారని ఎంఈవో శ్రీనివాస్‌ తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.



అన్విత



త్రిష

గ్రేట్‌ అచీవ్‌మెంట్‌

• ఫలించిన కలెక్టర్‌ కృషి
• గతంలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
• 95 మందికి 72 మంది ఉత్తీర్ణత
• విద్యాశాఖ అధికారులకు అభినందనలు

కరీంనగర్‌: వారు గతంలో పదోతరగతి పరీక్షలు రాశారు.. రెండు, మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్‌ అయ్యారు.. మళ్లీ పరీక్ష రాయాలనే ఆలోచన వారికి రాలేదు. పరీక్ష ఫీజు కట్టలేకపోయారు.. ఏదో ఒకపని చేసుకుందాంలే అని ఊరుకున్నారు.. అలా రెండు, మూడేళ్లు గడిచిపోయాయ్‌.. వారి అడ్రస్‌లు విద్యాశాఖ అధికారులకు తెలియకుండా పోయాయి. ఈ విషయం కలెక్టర్‌ పమేలా సత్పతి దృష్టికి వచ్చింది. సదరు విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్‌ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కనీసం పదోతరగతి పాసైతే చిన్న ఉద్యోగమైనా చేసుకుంటారని సూచించారు. విద్యార్థులు పరీక్షలు రాసేలా వారిని ఒప్పించారు. విద్యాశాఖ అధికారులు జిల్లాలో ఫెయిల్‌ అయిన 124మంది వివరాలు సేకరించారు. ఫీజులు చెల్లించారు. ఫెయిల్‌ అయిన సబ్జెక్టుల్లో ప్రత్యేకంగా పాఠాలు చెప్పించారు. వార్షిక పరీక్షలకు సిద్ధం చేశారు. 124 మందిలో 95మంది కరీంనగర్‌ ఓల్డ్‌ హైస్కూల్‌, హుజూరాబాద్‌ ప్రభుత్వ హైస్కూల్లో పరీక్షలు రాశారు. ఇందులో 72మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 40, బాలికలు 32మంది ఉన్నారు. దీంతో కలెక్టర్‌ పమేలా సత్పతి కృషి ఫలించింది. కలెక్టర్‌ ఇచ్చిన ప్రోత్సాహం, ప్రత్యేక శ్రద్ధతో పదో తరగతిలో పాసయ్యామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఫెయిలైన విద్యార్థులు పెద్దసంఖ్యలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందని కలెక్టర్‌ హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను డీఈవో జనార్దన్‌రావు, పరీక్షల విభాగం అసిస్టెంట్‌ కమిషనర్‌ నరసింహస్వామి కలిశారు. కలెక్టర్‌ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ విద్యార్థులు పాస్‌ కావడం చాలా హ్యాపీగా ఉంది.. గ్రేట్‌ అచీవ్మెంట్‌.. అని అన్నారు. 75.78శాతం ఉత్తీర్ణత మామూలు విషయం కాదన్నారు. ఫెయిల్‌ అయిన విద్యార్థులకు సప్లమెంటరీలో అవకాశం కల్పించాలని ఆదేశించారు. కాగా.. 10వ తరగతిలో ఫెయిల్‌ అయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు లోకిని అంజలి, లావణ్య, కొక్కు మణికంఠ సాయికిరణ్‌, తన్వీర్‌, బుష్రా ఫాతిమా, కవ్వంపల్లి శివ కలెక్టర్‌ను కలవగా.. వారిని అభినందించారు. వారికి డిక్షనరీలు అందజేశారు.

మత్స్యశాఖ అధికారిగా భారతి



భారతి

కరీంనగర్‌ అర్బన్‌: జిల్లా మత్స్యశాఖ అధికారిగా భారతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్‌ ఏడీగా పని చేస్తున్న ఆమెను ఇటీవల కరీంనగర్‌ బదిలీ చేశారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

క్వింటాల్‌ పత్తి రూ.7,400

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్‌ పత్తి రూ.7,400 పలికింది. బుధవారం మే డే సందర్భంగా మార్కెట్‌ యార్డుకు సెలవు ఉంటుందని, గురువారం యథావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి గుగులోత్‌ రెడ్డి నాయక్‌ తెలిపారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి



సంపత్‌ (ఫైల్‌)

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని కాట్రపల్లికి చెందిన ఓ గీత కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ముంజుల సంపత్‌(48) కల్లుగీత వృత్తితోపాటు వ్యవసాయ బావుల తవ్వకం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కాట్రపల్లికే చెందిన ఓ రైతు వ్యవసాయ బావి తవ్వుతుండగా విద్యుత్‌ షాక్‌ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
బుధవారం ॥ 1-5-2024



నేడు మే డే

ప్రతి శ్రమకూ ఒక విలువ ఉంటుంది.
పురుషుడు విలువ కలిగిన శ్రమే చేస్తాడు.
అతడిది ఉద్యోగం.
స్త్రీ విలువ కట్టని ఇంటి పని చేస్తుంది.
ఆమెది చాకిరి.
భారతదేశంలో స్త్రీ, పురుషుల్లో స్త్రీలు
అత్యధిక గంటలు ఏ ఖరీదూ లేని
ఇంటి పనుల్లో మునిగి ఉంటున్నారని
సర్వేలు చెబుతున్నాయి.
దేశ యంత్రాంగాలు అంతరాయం
లేకుండా ముందుకు సాగడంలో
ఈ శ్రమ నిశ్శబ్ద పాత్ర వహిస్తోంది.
స్త్రీల శ్రమకు విలువ కట్టలేకపోతే
కనీసం గౌరవం ఇవ్వడమైనా నేర్వాలి.

ఖరీదు కట్టే షరాబు లేదు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి. అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.



1. ఆపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమ చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.

3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెపుతుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

మే డే రోజున ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు.

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు...
1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3. దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు.

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు.

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హర్షధ్వానాలు తెలియచేయాలి.



1. సాచి 2. ఇలీన హ్యాట్స్ 3. అవంతి 4. అనన్య నందా 5. అంకిత కుందు 6. రణిత బెనర్జీ 7. లిష మిశ్రా 8. మిథాలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యూత్ పల్స్

యువ సంగీతాభిమానులకు అచ్చంగా సరిపోయే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నోరకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.

ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రనితా బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రనిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మిథాలీ ఠాకూర్ 'రైజింగ్ స్టార్' షోతో ఫేమ్ అయింది. భోజ్‌పురి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిశ్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది ఇలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు.



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం

'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'.... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ... అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికి నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో ప్రజల చేత 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడికీ నప్పదు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...



ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు. దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ను చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

అల్లూరి చేయనన్న ఎన్టీఆర్

అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను 'అల్లూరి సీతారామరాజు' తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్

త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా..', 'కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి. రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ..' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి.

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.

'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్... 'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు'(1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు



అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్



హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది.

వినూత్న కథాంశంతో...

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.



విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

తిండిబోతు దెయ్యం



నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది'' అన్నారు నరసింహా బోదాసు.